(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

89

(26' ఆగస్ట్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

'దేశంలో దానకర్ణులు కనిపించడం లేదుగానీ వాగ్దానకర్ణులు మాత్రం కొరతలేదు' అన్నాడు మొన్ననొక పెద్ద మనిషి.

నిజమే వాగ్దానాలు ఉత్సాహంలో మంచి, ఉద్రేకంలో నుంచి ఉబుకుతూ ఉంటాయి. కానీ వాటిని నిర్వహించడమే కొంచెం శ్రమతో, ఖర్చుతో కూడినపని.

వాగ్దానాలను వాయిదా వేయవచ్చుననే ధీమా ఏర్పడుతూ వుంటుంది. కానీ ఎంత ఫాయిదా పోతుందో అర్థం చేసుకోరా పెద్ద మనుష్యులు.

"ఏమండోయ్ మీరు ఫలానా విషయంలో వాగ్దానం చేశారు. పదినెలలు దాటి పోయింది. ఇంతవరకు నెరవేర్చారు కాదు. " అని ఎవరినైనా ప్రశ్నిస్తే..

"అవును చేసిన మాట నిజమే. ఎక్కడికి పోతుంది. పది నెలలు కానివ్వండి. పది సంవత్సరాలు కానివ్వండి. వాగ్దానం వాగ్దానమే. తప్పించుకునే శక్తి ఎవరికి వుంటుంది?" అని దబాయిస్తాడు.

"నిజమేననుకోండి. ఏది ఏమైనా వాగ్దానం చేసిన తర్వాత తీర్చివేస్తే మంచిదికదా! పైపెచ్చు మీరు పెద్దలు" అంటే

వాగ్దానం తప్పను విల్లులోనైనా వ్రాస్తా!

"ఎంత పెద్దవాణ్ణయితే మాత్రం మేం మాట నిలబెట్టుకోకుండా పోనులే! పెద్దవాణ్ణయ్యాను. నేను మాట చెల్లించకుండా పోతాననేగా మీ భయం. అంతగా అయితే విల్లులోనన్నా వ్రాసి పోతాగాని. మాట చెల్లించుకోకుండా వుండను. తెలిసిందా?" అని ఆయనగారు వాగ్దానానికి మరో వాగ్దానంతో హామీ యిస్తాడు.

వాగ్దానాలు చేసేవారు చేస్తూనే వుంటారు. కానీ వాటివల్ల లాభం పొందేవారికి కాలం కలిసిరావాలి. అంటే కర్మ తొలిగిపోవాలి. ఈ లోపల అవతల వాళ్ళను దూషించి మాత్రం ఏం లాభం?

అవును మరి బహుమతి ప్రదానం, సత్కారం, సన్మానం, ఇత్యాదులు ఎప్పటికప్పుడే జరిగిపోతాయి. వాటి విషయంలో చెరుకుగడ విరిచి చేతికిచ్చినట్లే వుంటుంది. కానీ వాగ్దానాలు అలా కాదు. అని దుంపల్లాగా బాగా ఊరాలి. అదృష్టం పండినప్పుడు వాటిని తవ్వి అందించాలి. అంతే.

మా బంధువుల్లో ఒకాయన చాలా ఉద్రేక ఉదారగుణం కలవాడు కూడా. అయితే రుణాలు కొంచెం జాస్తి. అందువల్ల పనులు అనుకున్నట్లు జరగవు. అంత మాత్రంతో గుణాల్ని ఎక్కడ చంపుకుంటాడు? పైగా అవి సహజమైనవి కదా!

అంతకు ముందు ఎవరెవరికి ఏమి వాగ్దానాలు చేశాడు. బంధువులు ఆయనకు సూచనలు చెయ్యడం ఆయన నిముషం ఆలోచించకుండా వాగ్దానాలు చెయ్యడం. ఆ తమాషా చూడండి.

మట్టిరోడ్డు ప్రక్క మంచినీటి బావి

ఒకరు "చూడు పార్థసారథి. మీ నాన్నగారు చాలా గొప్పవారు. ఎప్పుడూ ఈ మట్టిరోడ్డు వెంటే ఊళ్ళోకి వస్తూ ఉండేవారు. పైగా ఆయనగారిది చాలా చల్లటి మనస్సు. కనుక ఈ మట్టిరోడ్డు ప్రక్కగా ఒక మంచినీళ్ళ బావి తవ్వించు. ఆయన ఆత్మ ఎంతో సంతోషిస్తుంది. " పార్థసారథి (బిక్కముఖంతో) "కట్టిస్తా బాబాయి. తప్పకుండా కట్టిస్తా. ఈ నెలలోనే మొదలు పెట్టిస్తా. గొడ్లు నీళ్ళు త్రాగేందుకు పెద్ద తొట్టికూడా కట్టిస్తా బాబాయి. చుట్టూ చెట్లు వేయిస్తా. ఎవరన్నా వచ్చి కూర్చునేందుకు అరుగు ఒకటి కట్టించి మెట్లు కూడా పెట్టిస్తా బాబాయి" అన్నాడు.

"బాబాయి ఎలాగూ అంత పనిచేస్తున్నావు గనుక ఆ కట్టేది సిమెంటు నుయ్యే కట్టించు. మరల వరల నుయ్యి ఒక తరం కూడా సరిగా ఉండదు. ఆ నూతివల్ల మీ నాన్న ఆత్మకు శాంతి ఏం వుంటుంది?"

"ఉండదు బాబాయి ఉండదు. ఎంత మాత్రం ఉండదు. వరల నూతికి శాంతించే ఆత్మకాదు మా నాన్నది. చాలా గొప్ప ఆత్మ. ఏమన్నా సరిపెట్టుకుంటే సిమ్మెంటుతోనే సరిపెట్టుకోవాలి. నేనాయన కడుపున పుట్టాను. ఆయన ఆత్మే తెలియదంటావా బాబాయి"

బ్రతికి వుండగా గోతులేగానీ పోతే నూతులెక్కడ?

"తెలుసు గనకనే చెపుతున్నానోయ్. తండ్రులు బ్రతికి వున్నప్పుడు గోతులు తవ్వేవారేగానీ పోయిన తర్వాత వారిపేరిట నూతులు తవ్వే వారెవ్వరున్నారీ రోజుల్లో. కోటికి ఎక్కడో ఒక్కడు నీబోటి సుపుత్రుడు"

"ఏమంత సుపుత్రుణ్ణి బాబాయి. నేనేం నాన్న పేర సత్రవులు కట్టిస్తున్నానా, యాత్రికులకు సౌకర్యాలు కల్పిస్తున్నానా? " ఒక్కన్ను రెప్పగా అని ఎంతో వినయగా చెప్పాడు కుమార రత్నం

ఇప్పటికి పదిహేనేళ్ళయింది ఆ వాగ్దానం చేసి. ఇంతవరకా ప్రయత్నం మటుకు లేదు. ఆ రోజునే తండ్రి పేరు ఆ ఊరిలో ఒక గాంధీ విగ్రహం వేయిస్తానన్నాడు. పడిపోయిన హనుమంతుడి గుడికి ప్రాకారం కట్టిస్తానన్నాడు. కన్నీళ్ళతో చేసిన ఆ వాగ్దానాలు చన్నీళ్ళతో ఒకసారి ముఖం కడుక్కోగానే మరుపున పడిపోయాయి. ఆయన మాత్రం ఏం చేస్తాడు? అదోరకం ఉద్రేకం.

చాలాకాలం క్రింద ఒక ఊళ్ళో నాటక ప్రదర్శనం జరుగుతోంది ఒక పెద్ద మనిషి నాటకాన్ని మెచ్చుకుంటూ ఉపన్యసిస్తున్నాడు. ప్రేక్షకులలో ఒకాయన ఆయన దగ్గరికి వెళ్ళి "హీరోయిన్‌కి రజత పతకం ఇస్తాము మీరు కొంచెం ప్రకటించండి" అని తన పేరు చెప్పి చక్కా వచ్చాడు.

స్వర్ణం కాదయ్యోయ్!! రజతం

ఆ పెద్ద మనిషి మరి కొంచెంసేపు ఉపన్యసించి చివరకు "ఫలానావారు హీరోయిన్‌కి స్వర్ణపతకం ఇస్తానని వాగ్దానం చేశారు. ఒకటి రెండురోజులలో అందజేస్తామన్నారు" అని చెప్పాడు.

ప్రేక్షకుడు ఖంగారుపడుతూ లేచి నిలబడి "స్వర్ణం కాదండోయ్! రజతం" అని అరిచాడు. "అదంతా తర్వాత చూసుకొందాం లెండి" అని ఉపన్యాసకుడు దిగి వచ్చేశాడు. తర్వాత దానిమీద చాలా తకవార్ వచ్చింది. సభలో స్వర్ణం అన్నారు గనుక స్వర్ణమే ఇవ్వాలి గాని మాకు మారిస్తే నాకు అవమానం అంటుంది హీరోయిన్.

"నేను అలా అనలేదు. రజతమే అన్నాను. ఉపన్యాసకుడు చేసిన పొరపాటది. ఒకవేళ స్వర్ణపతకమే ఇవ్వవలసి వస్తే ఆ తేడా ఉపన్యాసకుడు భరించాలి. అది న్యాయం" అంటాడు బహుమతి వాగ్దానం చేసిన కళాభిమాని.

ఒక నెల రోజులు తర్జన భర్జన జరిగిన తర్వాత కళాభిమాని ఆయన మాట ప్రకారం వెండి మెడల్ తయారుచేయించి ఇచ్చేట్లు దానిమీద ఉపన్యాసకుడు తన స్వంత ఖర్చు బంగారం ఊదించి ఇచ్చేట్లు నిర్ణయమైంది. ఈ విషయం హీరోయిన్‌కి తెలియచేశారు.

ఉపన్యాసకుడు బంగారం ఊదించాలి

"ఊదిన బంగారం ఎన్నాళ్ళుంటుంది. అదేం పనికిరాదు" అని ఆవిడ అడ్డుపెట్టింది. మధ్యవర్తికి వళ్ళుమండిపోయింది. "బంగారం ఊడిపోతే అంటించుకుంటూ వుండవమ్మ. ఆ మాత్రం చేయలేవేమిటి? ఇట్టా పట్టు బడితే ఇకముందు ఎవరూ బహుమానాలే ఇవ్వరు" అని గట్టిగా డబాయించి మెప్పించి చక్కా వచ్చాడుట.

నారదుడు సంసారం చిత్రంలో పాపం అతగాడికి గుళ్ళు కట్టించాలని, గోపురాలు పెట్టించాలని తాపత్రయం బయలుదేరింది. అతడు దాతల వద్దకు బయలుదేరాడు. ఎక్కడికి ఏడంతస్థుల గోపురం అందులో మీరొక్క గోపురం కట్టించాలి అని అడగడం ప్రారంభించాడు.

అయిదు తర్వాత రా ఆరు నేను

అందరికీ తెలుసు ఇది నెరవేరే పనికాదని అందువల్ల ప్రతివారూ "మీరు అయిదో గోపురం కట్టించి నా దగ్గిరకు రండి ఆరోది నేను కట్టిస్తాను అని, ఆరు తర్వాత రండి ఏడోది కట్టిస్తా"నని చెప్పడం ప్రారంభించారు మొదటి అంతస్థుకి వాగ్దానం రాలేదు ఆ పని జరగనూ లేదు.

ఇలాటి వాగ్దానాల వల్ల ఎంతమాత్రం నష్టంరాదు. మనిషిని వదిలించుకోవడం అంత కష్టం కూడా కాదు.

Post your comments